# వార సంత వేలం రూ.4 లక్షల 28వేలు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే వార సంతకు గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి అధ్యక్షతన వార సంత వేలం పాట నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన పట్టేపు ప్రకాష్ రూ.4లక్షల 28వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గులాబ్ సింగ్, కార్యవర్గ సభ్యులు, మండల పంచాయతీ అధికారి శ్యామ్ సుందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఇప్ప నర్సారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్ధన్ గూడలో ఉచిత కంటి పరీక్ష శిబిరం



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలోని పర్ధన్ గూడలో గురువారం జేకే ఎస్పీఎం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన సలహాలు అందించారు. ఈ సందర్భంగా కోసిని సర్పంచ్ వసాకే పుల్లబాయి మాట్లాడుతూ గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జేకే ఎస్పీఎం సంస్థకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం కాగజ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శి వసాకే హనుమంతు, సిఎస్ఆర్ మేనేజర్ రేవతి, డాక్టర్ బియ్యాల వెంకటేశ్వర్, సుశీల, శివకుమార్, తన్నీరు విజయ్ కుమార్, అంగన్వాడీ టీచర్ చిన్నారి, వార్డ్ సభ్యులు రాజేష్, రోజా తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షా ల భయంతో సంప్రదాయాల వైపు రైతులు

## నాగలి పాతుతూ ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** యాసంగి వరి పంటలు చివరి దశలో ఉన్న సమయంలో వాతావరణ మార్పులతో అకాల వర్షాలు కురిసే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు దెబ్బతినకుండా ఉండాలని కోరుతూ రైతులు సంప్రదాయ విశ్వాసాలను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన రైతు గంట శ్రీనివాస్ తన వరి పొలంలో నాగలిని తిరగేసి పాతుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలా చేస్తే అకాల వర్షాలు కురవవని, పంటలు సురక్షితంగా ఉంటాయని పెద్దల నుంచి వస్తున్న నమ్మకం అని తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామంలోని దేవాలయాల్లో కూడా రైతులు ముడుపులు కడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ప్రకృతి అనుకూలంగా ఉండాలని, పంటలు నష్టపోకూడదని దేవుడిని వేడుకుంటున్నారు. వాతావరణంలో మార్పులు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ పంటలను రక్షించుకోవాలని సూచించారు.

# పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని మంగి గ్రామంలో గురువారం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆవులు, గేదెలకు కలిపి మొత్తం 234 పశువులకు టీకాలు ఇచ్చినట్లు పశువైద్యాధికారి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీప పశువైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. పశువుల ఆరోగ్యం కాపాడటం ద్వారా రైతులకు ఆర్థిక నష్టం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంగి గ్రామపంచాయతీ సర్పంచ్ రాయాసిడామ్ వినోద్, మండల పశువైద్య సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కల్లూరు మండలంలో జోరుగా అక్రమ మైనింగ్ మట్టి మాఫియా

- గ్రామాల్లో భారీ టిప్పర్ల శబ్దానికి ప్రజల గగ్గోలు
- మట్టి మాఫియా డాన్ చేతిలో కీలుబొమ్మగా సంబంధిత అధికారులు
- సమాచారం అందిస్తున్న ఫోన్ లిఫ్ట్ చేయని వైనం

**ఉద్యమ కెరటం, కల్లూరు:** కల్లూరు మండలంలో అక్రమ మట్టి మైనింగ్ జోరుగా కొనసాగుతుండటంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి కేవలం 100 గజాల దూరంలోనే ఎలాంటి అనుమతులు లేకుండా సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మట్టి తవ్వకాలు, రవాణా కొనసాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పుల్లయ్య బంజర, లోకారం, బత్తులపల్లి, కప్పల బంధం ప్రాంతాలతో పాటు కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులకు కమర్షియల్ ప్లాట్ల కోసం ప్రభుత్వ భూముల నుంచి భారీగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం. ఆంధ్ర ప్రాంతం నుంచి తెచ్చిన భారీ వాహనాలతో రాత్రింబగళ్లు మట్టి తరలింపులు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. సుమారు 40 టన్నుల లోడుతో వెళ్లే హెవీ టిప్పర్లు గ్రామాల గుండా రాకపోకలు సాగించడం ద్వారా రోడ్లు దెబ్బతింటున్నాయని, వాహనాల శబ్దాలతో గ్రామాల్లో ప్రజలకు నిద్రలేకుండా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు, రైతులు రాత్రిళ్లు టిప్పర్ల శబ్దాలతో భయాందోళనలకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే మట్టి మాఫియా డాన్‌లు అధికారులందరికీ డబ్బులు ఇస్తున్నామని, ఎవరికి చెప్పుకున్నా ఉపయోగం లేదని గ్రామ ప్రజలను బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ తవ్వకాలపై అధికారులకు సమాచారం ఇచ్చినా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, తహశీల్దార్ సహా సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సబ్ కలెక్టర్ పరిధిలోనే ఇలాంటి అక్రమ మైనింగ్ జరుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని ఆస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ సందర్భంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్–2026 బిల్లును ప్రవేశపెట్టిన నేపథ్యంలో మాట్లాడారు. ఈ సందర్భంగా హెల్త్ మినిస్టర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైద్య విధాన పరిషత్, డైరెక్టరేట్ కలిసి సమన్వయంతో పనిచేస్తే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మూడు వైద్య విధాన పరిషత్ సీహెచ్‌సీలు ఉన్నాయని, వాటిలో ఒకటి 100 పడకల ఆస్పత్రి, ఒకటి 50 పడకల ఆస్పత్రి, మరొకటి 30 పడకల ఆస్పత్రి కొత్త భవనాలతో ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన మౌలిక వసతులు, స్పెషలిస్ట్ డాక్టర్లు లేకపోవడంతో ప్రారంభించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ప్రత్యేకంగా కల్లూరు సీహెచ్‌సీలో క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న వైద్యులు కూడా కాంట్రాక్ట్, ఇతర ఆస్పత్రుల నుంచి తీసుకొచ్చిన వారేనని తెలిపారు. తక్షణమే అవసరమైన క్యాడర్ స్ట్రెంత్ మంజూరు చేసి, 100 పడకల ఆస్పత్రికి సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే నియోజకవర్గం గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందినదని, డెప్యుటేషన్‌పై వచ్చిన డాక్టర్లు తిరిగి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని తెలిపారు. దీంతో ఇక్కడ పనిచేసే డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్ ఇవ్వాలని మంత్రి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.

# తుది దశకు గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఖమ్మం నగరం ధంసలాపురం వద్ద మున్నేరు నదిపై నిర్మించిన బ్రిడ్జి పనులు పూర్తి కాగా, రైల్వే బ్రిడ్జి నిర్మాణం చివరి దశలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పచ్చని పొలాల మధ్యగా సాగుతున్న ఈ విశాలమైన రహదారిపై ఇరువైపులా సౌర విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కిలో మీటర్ల దూరం వరకు నిఘా ఉంచగలిగే సోలార్ సీసీ కెమెరాలు, ప్రమాదాలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించే ఆధునిక సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే సూర్యాపేట– విజయవాడ మార్గంలో సుమారు 12 గంటల ప్రయాణం చేయాల్సి వస్తోంది. అయితే ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రారంభమైతే దాదాపు 56 కిలో మీటర్ల దూరం తగ్గి, సుమారు నాలుగు గంటల వరకు ప్రయాణ సమయం ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రహదారిపై ప్రయాణించిన దూరానికి అనుగుణంగా టోల్ చార్జీలు వసూలు చేసే విధానాన్ని అమలు చేయనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడంలో ఈ హైవే కీలకంగా మారనుంది. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తి కావడంతో మే నెలలో పూర్తి స్థాయిలో రాకపోకలు ప్రారంభించే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు. మే నెల చివరి వారంలో హైవేను ప్రారంభించేందుకు జాతీయ రహదారుల సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.

# సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్ రాజర్షిషా అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో 98వ మహాజన సభను కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆర్థిక స్థితిగతులు, బడ్జెట్ అంచనాలు, ఉద్యోగుల వేతన సవరణ ఒప్పందాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్ నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంక్ వ్యయ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బ్యాంక్ ఖర్చులను తగ్గించి లాభాల బాటలో నడిపించేలా చర్యలు తీసుకోవాలని, ప్యాక్స్ పరిధిలో రుణాల రికవరీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రికవరీ రేటును పెంచడం ద్వారా బ్యాంక్ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో డీసీసీబీ కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సహకార సంఘాల బలోపేతంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నానో యూరియా నిల్వలను అధికంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఈఓ రవి కుమార్, జీఎం సూర్య ప్రకాష్, డీఆర్ ఓఎస్డీ సింహచలం, సీనియర్ అధికారులు, పీఏసీఎస్ పీఐసీ చైర్మన్లు, నాబార్డ్ అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలం రామాలయం అభివృద్ధికి రూ.351 కోట్లు

- సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

**ఉద్యమ కెరటం, భద్రాద్రి కొత్తగూడెం:** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం పునరాభివృద్ధి, పునరుజ్జీవన పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. రామాలయం అభివృద్ధికి మూడు దశల్లో మొత్తం రూ.586 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. మొదటి విడతగా రూ.351 కోట్లను మంజూరు చేస్తూ దేవాదాయ శాఖ డైరెక్టర్ జీఓ నం.ఆర్.టి–167 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. 2024 మార్చి 11న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటన సందర్భంగా రామాలయం, భద్రాచలం పట్టణ అభివృద్ధికి సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ మాస్టర్ ప్లాన్ రూపొందించి మొదటి దశ పనులకు అనుమతులు మంజూరు చేసింది. శ్రీరామ నవమి సందర్భంగా జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం రానున్నారు. అదే సందర్భంగా రామాలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో భద్రాద్రి రామాలయం నిర్లక్ష్యానికి గురైందని, కోట్లాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# రహదారి విస్తరణలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జాతీయ రహదారి–63 విస్తరణ పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం మందమర్రి మండలం తిమ్మాపూర్ ప్రాంతంలో ఆర్మూర్–చంద్రాపూర్ వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను మండల తహశీల్దార్ సతీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలో అమలవుతున్న 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును తహశీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగంతో కలిసి పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణ పనులు చేపట్టేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇంటి పన్ను, ఇతర పన్నులను వంద శాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును సందర్శించారు. నివాసాల నుంచి సేకరించిన చెత్తలో ఉపయోగకరమైన వాటిని వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

